క్లుప్తంగా

ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ముగిశాయి. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో డాక్టర్ నిష్కించిన భక్తిదాస పర్యవేక్షణలో గత మూడు రోజులుగా వేడుకలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గాదిరాజు ప్యాలెస్‌లో వేసిన భారీ సెట్‌లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాధాకృష్ణులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. బృందావనం నుంచి వచ్చిన లడ్డు గోపాలునికి ఉయ్యాల సేవ నిర్వహించారు. దీంతోపాటు హరేకృష్ణ మూవ్‌మెంట్ వ్యవస్థాపకుడు శ్రీ భక్తివేదాంత స్వామి ప్రభు పాదుల విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం సంగీత కళాకారుల చే సామూహిక భజగోవిందం, హరి నామ జపం నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 వరకు భక్తులు భారీగా తరలివచ్చి ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

శునకాలను సంరక్షించాలి



తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యువకులు

మద్దిలపాలెం : శునకాల సంరక్షణ కేంద్రాలు ఎక్కడికక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరుతూ మద్దిలపాలెంలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద విశాఖ యువత ప్లకార్డులతో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. శునకాల సంరక్షణ బాధ్యతలు మంచిగా చూసే వరకు రోడ్లపై నిరసనలు తెలియజేస్తూనే ఉంటామని నినాదాలు చేశారు. ప్రభుత్వం రక్షణ కల్పించలేనప్పుడు వాటిని స్వేచ్ఛగా బతకనివ్వండని డిమాండ్ చేశారు. ఎక్కడికక్కడ డాగ్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శంకర్ దేవర, సరోజ, శ్రీను, మణి, ఇషికా, వెంకటేష్ యాదవ్, పవన్, సాయి, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఉట్టికొట్టే వేడుక



ఇసుకతోటలో చిన్నారులతో ఉట్టి కొట్టిస్తున్న సంఘం సభ్యులు

మద్దిలపాలెం : శ్రీ రాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో జీవీఎంసీ 16వ వార్డు పాత వెంకోజీపాలెంలో ఆదివారం కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఉట్టికొట్టే కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. సంఘం కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొని సరదాగా ఉట్టి కొట్టారు. పలువురు చిన్నారులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. కనకమ్మ ఆలయం పక్కనున్న సామాజిక భవనంలో కృష్ణుని ప్రతిమను ఉంచి పూజలు నిర్వహిచారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాల రాజు మాట్లాడుతూ సోమవారం స్వామి ప్రతిమ నిమజ్జనం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఇసుకతోటలోని శ్రీకృష్ణ ఉమామహేశ్వర సాయి దుర్గ యాదవ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యవర్గ సభ్యులు చిన్నారులచే ఉట్టి కొట్టించారు.

- పేదల ఆరోగ్యం విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- జ్వరం మందులూ సరఫరా చేయని పాలకులు
- ఆస్పత్రుల నిర్వహణను గాలికొదిలేసిన ఉన్నతాధికారులు

ప్రభుత్వ మానసిక ఆస్పత్రి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల్లేవ్..!



విమ్స్ ఆస్పత్రి

బీచ్‌రోడ్డు : కూటమి ప్రభుత్వం **ఏర్పాడి ఏడాది** దాటినా ప్రజలకు మెరుగైన **వైద్య సేవలు, సంక్షేమ** పథకాలు అందించడంలో **నిర్లక్ష్యంగానే వ్యవహ**రిస్తోంది. ముఖ్యంగా ప్రజలకు **విద్య, వైద్యం అనేవి** చాలా అవసరం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ రెండు రంగాలకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిచ్చి పేద, బలహీన వర్గాలకు అండగా నిలిచారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలని గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేసి అప్‌గ్రేడ్ చేశారు. సిబ్బంది కొరత లేకుండా ఖాళీలను భర్తీ చేయడంతోపాటు అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. రోగులకు ఇంటి వద్దనే వైద్య సేవలు అందించేందుకూ ఏర్పాట్లు చేశారు. అయితే గత ఎన్నికల్లో మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. ఆస్పత్రుల నిర్వహణను పట్టించుకోవడం **లేదు సరికదా... కనీసం జ్వరమొస్తే రోగులకు అందించే మందులూ సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా పేదలకు మెరుగైన వైద్యం అందక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి అప్పులపా**లవుతున్నారు.

వేధిస్తున్న మందుల కొరత

తూర్పు నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ ఆర్‌సీడీ, మానసిక ఆస్పత్రి, ఛాతీ ఆస్పత్రి, విమ్స్, ఈఎన్‌టీ ఆస్పత్రులున్నాయి. వీటిలో వైద్యం పొందేందుకు నిరంతరం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. అయితే వీరికి సరిపడా మందుల సరఫరా అయితే లేదు. దీంతో చాలా వరకు మందులను బయట ప్రైవేటు మందుల షాపుల్లో కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది.

పీసీఎం 500, కార్మిడల్ 3.5, కార్డరోన్, విల్డగ్లిప్టన్, లివోథైరాక్సిన్ 25, ప్రగబ్లిన్, సెఫ్రాక్సిన్, టెప్లీ క్లిప్టిన్, లిథియం కార్బోనైట్, క్లోనాజెపం, సోడియం వాల్ప్రోయేట్, ఎస్కిటోప్రామ్, సెర్టాలిన్, కార్బమాజెపైన్ మందులతోపాటు ముక్కులో వేసే జైలోమేట్ డ్రాప్స్ వంటివి కూడా అందుబాటులో లేవంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఓపీ రోగులు ఈ మందులు అందుబాటులో లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బయట ప్రైవేటు మెడికల్ షాపుల్లో వందలాది రూపాయలు ఖర్చు చేసి పేద రోగులు మందులు కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది.



ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రి

జనరిక్ షాపుల్లోనూ మందులు లేక...



ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరిన రోగుల కోసం అవసరమైన మందులు అందుబాటులో లేకపోతే... స్థానికంగా ప్రైవేటుగా కొనేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుమతులను ఇచ్చింది. దీంతో **ఆ ఐదేళ్లు** ఏవైనా మందులు అందుబా**టులో లేకపోయి**నా వెంటనే కొనుక్కుని ఆస్ప**త్రులకు వచ్చే రో**గులకు అందించే వీలుండేది. **కానీ ప్రస్తుతం** కూటమి ప్రభుత్వం అందుబా**టులో లేని మం**దులను జనరిక్ షాపుల్లో **మాత్రమే తీసుకో**వాలని ఆదేశాలు జారీ చేసింది. **దీంతో చాలా** మందులు జనరిక్ షాపుల్లో **కూడా అందుబా**టులో ఉండడం లేదు. ఫలితంగా **రోగులకు అవ**సరమైన మందులు లభించక **మెరుగైన వైద్యం** అందించడంలో చాలా **జాప్యం జరుగుతో**ంది.

జ్వరం మందులూ లేవాయే...

కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీం**తో సాధారణంగా** జ్వరాలు ప్రబలుతాయి. ముఖ్యంగా పిల్లలకు ఎక్కువగా జ్వరాలు వస్తాయి. ఆ జర్వాలు తగ్గడానికి వేసుకునే పారాసిటమాల్ 500 ఎంజీ సరఫరాను ప్రభుత్వం నిలిపేసింది. గడిచిన నెల రోజులుగా ఈ మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో లేవు. పిల్లలకు అవసరమైతే పెద్దలు వేసుకునే 650 ఎంజీని వేసుకోమని చెబుతున్నారు. పెద్దలు వేసుకునే టాబ్లెట్‌ను ఇలా పిల్లలకు వేయడం వల్ల వారి ఆరోగ్యంపై పెను ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అలాగే గుండె జబ్బులకు సంబంధించిన కార్డరోన్ ఇంజక్షన్లు, కార్మిడల్ మందుల సరఫరాను ప్రభుత్వం నిలిపేసింది. దీంతో గుండె జబ్బులతో బాధపడుతున్న వారు ప్రైవేటు మెడికల్ షాపుల్లో మందులు కొనుక్కోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

డివైడర్‌పై ఊడిన పలకలు



రామకృష్ణాపురం కూడలి వద్ద డివైడర్‌పై ఊడిపోయిన పలకలు

ఆరిలోవ : బీఆర్‌టీఎస్ రోడ్డు డివైడర్లపై పాదచారుల కోసం అమర్చిన పలకలు పలుచోట్ల ఊడిపోతున్నాయి. కొన్ని పలకలు పూర్తిగా ఊడిపోయాయి. దీంతో అలాంటిచోట నడవడానికి వీలులేని పరిస్థితి నెలకొంది. ఐదు లైన్ల బీఆర్‌టీఎస్‌లో అవసరమైనచోట బస్టాప్‌లు ఏర్పాటు చేశారు. కూడళ్ల నుంచి ఆ బస్టాప్‌ల వరకు పాదచారులకు వీలుగా ఫుట్‌పాత్‌లు నిర్మించారు. వాటిపై అమర్చిన పలకలు పలుచోట్ల ఊడిపోయి పాదచారులు నడవడానికి ఆటంకంగా మారాయి. జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి రామకృష్ణాపురం, దీన్‌దయాల్‌పురం, పైనాపిల్ కాలనీ కూడళ్ల వద్ద వీటిపై పలకలు ఊడిపోయాయి. వాటికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షాలకు జారిపడిన రిటైనింగ్ వాల్



దారిలో జారి పడిన గోడ

మద్దిలపాలెం : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జీవీఎంసీ 15వ వార్డు లక్ష్మీ నరసింహనగర్ కొండవాలు ప్రాంతంలో రమణమ్మ ఇంటి దారి వద్ద రిటైనింగ్ వాల్ ఆదివారం జారిపోయింది. దీంతో అక్కడున్న నివాసులు తమ ఇళ్లకు వెళ్లే దారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి ముందు నుంచి కాకుండా వెనుక దారి నుంచి వెళ్లే దుస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిశీలించిన స్థానిక నాయకులు నివాసులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. వర్షాలు ఇంకా కురిసే అవకాశం ఉన్నందున ఎవరూ ఆందోళన చెందొద్దని, అత్యవసరమైతే సింహాద్రిపురం సామాజిక భవనంలో ఉండొచ్చని సూచించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు తెలియజేశామని తెలిపారు.

➡ భారీ వర్షాలకు మట్టి చరియలు జారిపడే ప్రమాదమున్న జీవీఎంసీ 15వ వార్డులో గల కొండవాలు ప్రాంతాలు లక్ష్మీనరసింహనగర్, సింహాద్రిపురం కాలనీలో జీవీఎంసీ ఈఈ గంగాధర్, అధికారులు ఆదివారం పరిశీలించారు. తక్షణమే రక్షణ చర్యలు చేపడతామని అధికారులు పేర్కొన్నారు.

భారీ వర్షానికి బైక్‌పై కూలిన చెట్టు

బీచ్‌రోడ్ : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి పెదవాల్తేరు విశాఖ ఐ ఆస్పత్రి సమీపంలో బైక్‌పై చెట్టు కూలింది. అయితే ఆ సమయంలో బైక్‌ను పార్క్ చేసిన వాహనచోదకుడు షెల్టర్‌లో ఉండడంతో ప్రాణాపాయం తప్పింది.



పెదవాల్తేరు విశాఖ ఐ ఆస్పత్రి సమీపంలో బైక్‌పై కూలిన చెట్టు

తెరిపివ్వని వర్షం



ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో ఎంవీపీ కాలనీలో ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ

- రహదారులన్నీ జలమయం
- పలు చోట్ల యూజీడీ డ్రైన్స్ లీక్
- వాహనదారులకు ఇక్కట్లు
- ఉధృతంగా ప్రవహించిన గెడ్డలు

ఎంవీపీ కాలనీ : నియోజకవర్గంలో శనివారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షం ఆదివారం కూడా తెరిపివ్వకపోవడంతో జనజీవనం స్తంభించిపోయింది. భారీ వర్షం కారణంగా ఎంవీపీ కాలనీలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. ఆదివారం ఉదయం నుంచి తెరిపివ్వకపోవడంతో కాలనీల్లో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. పెద్దఎత్తున వర్షం కురవడంతో రహదారులపై భారీగా నీరు చేరుకుంది. ఏఎస్ రాజా కూడలికి నాలుగు వైపుల నుంచి నీరు ముంచెత్తడంతో జలమయంగా మారింది. దీంతో ఐ హాస్పిటల్ నుంచి ఇసుకతోట కూడలి వైపు, బీచ్ వైపు నుంచి వచ్చే వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ సైతం జామ్ అవ్వడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పాడింది. లాసన్స్ బే కాలనీ రహదారి, శివాజీపార్క్ రహదారి నీట మునగడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. భారీగా నీరు చేరడంతో డ్రైనేజీలు సైతం మొరాయించాయి. దీంతో కొన్నిచోట్ల వర్షపు నీరు, డ్రైనేజ్ నీరు ఏకమవ్వడంతో చెత్తంతా రోడ్ల పైనుంచి ప్రవహించింది. పలుచోట్ల యూజీడీ డ్రైన్లు ఉప్పొంగడంతో భారీగా మురుగునీరు రోడ్లపైకి చేరింది. షాపుల ముందు నీరు చేరడంతో వీధి వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వర్షపు నీరు కారణంగా హనుమంతవాక నుంచి లాసన్స్ బే తీరం వైపు ప్రవహించే గెడ్డ పోటెత్తింది. ఉప్పొంగి ప్రవహిస్తున్న గెడ్డతో పలుచోట్ల ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయి.



వర్షపు నీటితో జలమయమైన లాసన్స్ బే కాలనీ రహదారి



నీట మునిగిన శివాజీపార్క్ రహదారి

హరేకృష్ణ వైకుంఠంలో వైభవంగా నందోత్సవం

వ్యాసపూజతో ముగిసిన కృష్ణాష్టమి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీరాధామదన్‌మోహన్



శ్రీభక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల ప్రతిమ

తగరపువలస : ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీరాధా మదన్ మోహన మందిరంలో ఆదివారం వైభవంగా నిర్వహించిన నందోత్సవం, వ్యాసపూజతో కృష్ణాష్టమి ఉత్సవాలు ముగిశాయి. నందమహారాజుకు పుత్రుడు జన్మించిన ఆనందంతో అప్పట్లో బృందావనవాసులకు విందు ఏర్పాటు చేశారని హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస తెలిపారు. ఈ సంప్రదాయం ప్రకారం ఆదివారం భక్తులకు రకరకాల పిండివంటలతో విందు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భక్తులు తమ ఇష్టదైవమైన శ్రీకృష్ణ భగవానుని దర్శనం అనంతరం ప్రసాదాలు స్వీకరించారు. అలాగే శ్రీభక్తి వేదాంత స్వామి ప్రభుపాదులు శ్రీకృష్ణజన్మాష్టమి తర్వాత ఆవిర్భవించారని, అందువల్ల ఈ రోజును వ్యాసపూజగా శ్రీకృష్ణ భక్తులు విశ్వవ్యాప్తంగా నిర్వహిస్తారన్నారు. అందులో భాగంగా శ్రీభక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల వారికి సప్తనదుల నుంచి సేకరించిన జలాలు, పండ్ల రసాలు, పంచామృతాలు, వేదమంత్రాల నడుమ అభిషేకం నిర్వహించారు. భీమిలికి చెందిన కృష్ణ కూచిపూడి నిత్య నిలయం, శివ సంస్కృతి ఆర్ట్స్ అకాడమీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హరినామ జప మండపంలో 108 పలకలతో ఏర్పాట్లు జరిగిన చోట భక్తులు ప్రశాంతంగా పాల్గొన్నారు. కార్యక్రమాలు ముగిసినట్టు అంబరీష దాస తెలిపారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు ఆదివారంతో 24వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య పూజలు ప్రారంభించారు. 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, సహాయ ఇంజినీర్ డీవీఎస్ రామరాజు, పర్యవేక్షకుడు తిరుపతిరావు, వేదపండితులు ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆక్యుప్రెషర్‌పై ముగిసిన శిక్షణ



ముగింపు సభలో మాట్లాడుతున్న సౌమిత్ర దాస్

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు పరిధి పిఠాపురం కాలనీలో ఆగస్టు 12 నుంచి 17 వరకు 5 రోజులపాటు నిర్వహించిన ఆక్యుప్రెషర్ రిఫ్లెక్సాలజీ శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈ శిక్షణను లాల్ నాయక్ ట్రస్ట్ (విశాఖపట్నం), ఒడిశా స్వాస్థ్య సంఘ్ (కటక్) సంయుక్తంగా నిర్వహించాయి. కటక్ నుంచి ప్రఖ్యాత చికిత్సకుడు సౌమిత్ర దాస్ తన బృందంతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా 37 మందికి రిఫ్లెక్సాలజీ ఆవశ్యకతను నేర్పించారు. చివరగా పరీక్ష నిర్వహించి, విజయం సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో హాజరైన వక్తలు మాట్లాడుతూ పురాతన ఆక్యుప్రెషర్ పద్ధతులు చాలా సరళంగా, ప్రభావవంతంగా పనిచేస్తాయన్నారు. బోధించిన లాల్ నాయక్ ట్రస్ట్, ఒడిశా స్వాస్థ్య సంఘ్ ప్రయత్నాలను ప్రశంసించారు. లాల్ నాయక్ ట్రస్ట్ డైరెక్టర్ రామచంద్ర నాయక్, థెరపిస్ట్ సౌమిత్ర దాస్, రిటైర్డ్ సూపరింటెండెంట్, హెల్త్ మేనేజ్‌మెంట్ ట్రైనర్ వెంకటరావు, మహారాణిపేట బ్రహ్మకుమారీస్ విభాగం అధిపతి సిస్టర్ శివలీల, ఆయుర్వేద రిటైర్డ్ ప్రొఫెసర్ ఈశ్వర్, పతంజలి యోగా శిక్షకుడు రవి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికై పోరాటం

- అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా 10వ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి చంద్రావతి
- జిల్లా కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక



సిటు మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి చంద్రావతి

సబ్బవరం: అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేసి, వారి సమస్యలను పరిష్కరించకపోతే పోరాటానికి సిద్ధమని సిటు రాష్ట్ర కార్యదర్శి చంద్రావతి హెచ్చరించారు. స్థానిక సీతారామ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సిటు) 10వ జిల్లా మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్లు గ్రామాల్లో మాతా శిశు మరణాలను తగ్గించి పిల్లలకు కౌమార విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోవడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వంలో 42 రోజుల పాటు సమ్మె చేయగా, వేతనాల పెంపు, గ్రాట్యుటీ చట్టాల అమలు హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. అప్పుడు ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ నేతలు సమ్మె శిబిరాలకు వచ్చి అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని, వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా కనీసం పట్టించుకోవట్లేదని ఆక్షేపించారు. అంగన్‌వాడీల కనీస విధులతోపాటు, అదనపు బాధ్యతలు, యాప్‌ల పేరిట వేధించడం సరికాదన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాన్ని ఉధృతం చేస్తామని, అంగన్‌వాడీలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, జిల్లా కోశాధికారి వీవీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ మహాసభలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

'సృష్టి గర్భ' పుస్తకావిష్కరణ

సీతంపేట: నాటక రచయిత, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ రచించిన 'సృష్టి గర్భ' (ఉపనిషత్ కాంతి) పుస్తకావిష్కరణ సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. శ్రీమాతా కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎస్.మాధవ్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఉపనిషత్తులలోని లోతైన భావాలను హృదయానికి హత్తుకునేలా రచయిత పుస్తకంలో పొందుపర్చారన్నారు. ప్రస్తుత ప్రపంచం భారతదేశ సంస్కృతీ సంప్రదాయాల వైపే చూస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి రచనలు భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాల విశిష్టత తెలియజేస్తాయన్నారు. ఈ సందర్భంగా గ్రంథ కర్త విజయభాస్కర్‌కు నాటక రత్న బిరుదును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. గ్రంథ కర్త మాట్లాడుతూ తీరని ఆధ్యాత్మిక ఆర్తితో సల్పిన సత్య శోధన, నిత్యసాధనలో పొందిన ఆత్మజ్ఞానం, దైవ కృపతో రాసిన గ్రంథమే సృష్టి గర్భ ఉపనిషత్ కాంతి అని తెలిపారు. విజయనగరం మున్సిపల్ కమిషనర్ పల్లి నల్లనయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పొలమరశెట్టి ఫ్రాన్సిస్, డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ, ప్రవచనకర్త రామకృష్ణానంద్, రచయిత వాడ్రేవు చిన వీరభద్రుడు, వాగ్గేయకారుడు అందెశ్రీ, న్యాయవాది అల్లు కేశవ జోగినాయుడు, కళాపీఠం అధినేతలు బి.ఎస్.మూర్తి, పల్లి నాగభూషణం పాల్గొన్నారు.